


# సూత్రధారి

రోజూ ఊరు మేల్కొంటుంది. ఇంటింటా మనుష్యుల అవసరాలనుతీర్చి అపవిత్రురాలైన గంగాభవాని నేల మీదికి నెట్టివేయబడుతుంది. నేలపాలైన గంగ దిక్కులేక సైడుకాల్వలను ఆశ్రయిస్తుంది. సైడుకాలువలన్నీ ఒళ్ళు విరుచుకుని, ఉరకలతో ముందుకు పరుగులుదీసి, క్రమంగా ఒకదాన్నొకటి పెనవేసుకుంటూ, అవధిని పెంచుకుంటూ దేశంనుండి బహిష్కరింపబడిన దోషిలా ప్రవహిస్తూ, ఊరి చివర ఏకవాహినిగా సాక్షాత్కరిస్తుంది. వైతరణిని జ్ఞప్తికి దెస్తూ ఊరిచివర రెండుబారల వెడల్పుతో సాగిపోయే ఆ మురుగుకాలువకు ఒక వైపుగట్టున వరుసగా కొన్ని చింత చెట్లు, రెండవవైపున కాలువకు సమానాంతరంగా పెంకు టిళ్ళవరుస ఒకటి. అక్కడక్కడ కొన్ని తాటాకుగుడిసెలూ వున్నాయి. ఆ యిళ్ళల్లో వారందరూ సూర్యదర్శనంకోసం వాకిట్లోకివస్తే సూర్యుడికన్నా ముందు ఆ మురుగుడుకాలువ దర్శనమిస్తుంది.

ఆ దారిని వెళ్ళాలంటే అది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. మంచి గుక్క గలవాడుగానైనా వుండాలి; లేదా బాగా పరుగెత్తగలవాడుగానైనా వుండాలి. ఈ రెండూ చేతగానివాడి అవస్థ — ఈతరాక బావిలో జారిపడ్డవాని పరిస్థితితో సమానమే. కాని, పై రెండుపనులూ చేతగాని వాళ్ళు కొందరు ఆ యిళ్ళల్లో వుంటున్నారు. కారణం — శక్తికితగిన ఆవాసాలు దొరకకపోవడం. ఊరు పెరిగి పోయింది. ఊరు పెరిగిపోతూన్న కొద్దీ అద్దెలుకూడా పెరిగి పోతున్నాయి.

రోజూ మురుగు కాలువను తిట్టుకుంటూ ముక్కు మూసుకుని భరించే ఆ ప్రాంతంలో ఒక 'చెడు' రోజున ఒక విచిత్రమైన సంఘటన జరిగింది.

* * *

భర్తను పనికి సాగనంపి, అతన్ని వెనుకనుండిచూస్తూ గుమ్మంలో నిలబడింది సుభద్ర. దూరంగా భర్త మలుపు దిరిగి, మాయమయ్యాడు. ఇంతలో ఉయ్యాలలోనుంచి బాబు ఏడుపు వినిపించింది. సుభద్ర లోపలికి వెళ్ళి, ఉయ్యాలలో ఏడుస్తూ కూర్చున్న పదినెలల కొడుకును చంక కెత్తుకొని, వాడిమీద ముద్దులవాన కురిపించింది...భర్త వెళ్ళి పోయాడు; తొందరపను లేమీలేవు...ఆమె తన ముద్దు కుమారుణ్ణి చంకనబెట్టుకొని గుమ్మంలోనికి వచ్చి నిలుచున్నది.

ఎట్టయెదుట మురుగుకాలువ. అవతలిగట్టున వరుసగా చింత చెట్లు. కొండకోన అంచునుండి రెండు బారల యెత్తుకు ఎగబ్రాకివున్న సూర్యబింబం చెట్ల గుబురుల్లోంచి కనిపిస్తోంది. పచ్చటి గుబురుటాకులగుండా దూరి, మురుగు కాలువలోపడి వింతవింత రంగుల్ని సృష్టిస్తున్నాయి సూర్య కిరణాలు. పాలపిట్టల అరపులు నిరవకాశంగా వినిపిస్తున్నాయి. నీరెండపడి సుభద్రఒళ్ళు, సుభద్రా తనయుని ఒళ్ళు మేలిమి బంగారంలా మెరిసిపోతున్నాయి.

సుభద్ర చూపు మరల్చింది. నీరెండలో—తనయింటి గోడవారగా ఒక ఆడకుక్క కళ్ళుమూసుకుని పడుకుంది. దాన్నిచుట్టుముట్టి నాలుగైదు కుక్కపిల్లలు పాలుత్రాగడానికి ఎగబడుతున్నాయి. మూర్తీభవించిన మాతృత్వంలా వున్న ఆ కుక్కను, ముద్దుగొలుపుతోన్న ఆకుక్కపిల్లల్నీ చూసి సుభద్ర పారవశ్యంతో కొడుకును గుండెలకు హత్తుకొంది. వాడి బుగ్గలమీద, పెదాలమీద, ముక్కుమీద ముద్దు పెట్టుకుంది. తనివితీరకుండా—వాడి చిన్నకురులను సవరించి, మళ్ళీ ముద్దు పెట్టుకోబోయింది. వాడు వులికిపడ్డట్టు కిలకిల నవ్వుతూ ముఖానికి చేతు లడ్డంపెట్టుకున్నాడు. గుక్కపట్టి గట్టిగా నవ్వాడేమో — వాడి చిన్నికడుపు ఉబ్బిపోయింది. అలసిపోయాడు. పాలు త్రాగుతూవున్న కుక్కపిల్లల్ని కాస్సేపుచూచి, కాళ్ళు విదిలించుకుంటూ గబుక్కున సుభద్ర రొమ్ముల్లో తల దూర్చాడు. సుభద్ర సిగ్గుపడి,

క్రీగంటచూట్టూ ఒకసారి చూచి, పైటచెరుగును కొడుకు ముఖానికి అడ్డంగా జార్చింది.

ఇంటిముందర యిద్దరు కుర్రాళ్ళు — గంగాబాయి కొడుకు గోపీ, జానకమ్మ కొడుకు జగ్గు — రబ్బరు బంతిని ఎగురవేసుకుంటూ ఆడుకుంటున్నారు. సుభద్ర వాళ్ళఆటను చూసింది. బంతిని చూచింది. బంతి చాలా బాగుంది. నారింజకాయ ప్రమాణంలోవుండి, నేలమీద మోదితే నాలుగు నిలువుల ఎత్తుకు ఎగిరిపడుతోంది...తనకొడుకు బంతి ఆడుతుండగా చూడాలన్న కోరిక కలిగింది సుభద్రకు. తన కోరికను కాలం తీర్చవలసిందే!...కనీసం మరొక్క ఏడాదైనా గడిస్తేగానీ తన కొడుకు బంతి ఎగురవేయలేడు. ఆ ఒక్కసంవత్సరం ఇప్పుడే గడిచిపోరాదూ?...“ఛీ... నా మతిమండ! ఇదేం కోరిక? ... నా చిట్టిబాబు ఎప్పుడూ యిల్లాగే వుండాలి! మరో పదేళ్ళన్నా కానీ, యిరవై ఏళ్ళయినా కానీ” అనుకుంది సుభద్ర మళ్ళీ.

మురుగు కాలువలోంచి ఎగిరివచ్చిన దుర్గంధం— తీయటికలలో వులికిపాటులా—ఆమె ముక్కు పుటాలదగ్గర సుడులు తిరిగింది. సుభద్ర ముక్కుమూసుకుంది. “ఛీ! పాడుకంపు! రోజూ దీన్ని భరించడం ఒక రొంపైపోయింది. కాలువనుపూడ్చి పుణ్యంకట్టుకోక ఈ మునిసిపాలిటీ వాళ్ళు చేసే రాజకార్యం మరేముందో?” అనుకుంది“ఇంకెన్నాళ్లు లే యీ యాతన? ఆయనకు ప్రమోషన్ రావాలేగానీ, నెల

నెలా ముప్పైరూపాయలు విసరికొట్టి గాంధీనగర్‌లో సరి కొత్త బంగళా చూసుకొని కాపురంబెట్టడం ఎంత సేపు?..''

—ఇంతలో, బంతి ఆట ఆడుకుంటూన్న పిల్లల్లో ఏదో కలకలం రేగింది. వాళ్ల బంతి మురుగు కాలువలోకి దొర్లి పడి, శాపగ్రస్తుడైన చంద్రుడిలా వికృతరూపం దాల్చింది.

జానకమ్మగారబ్బాయి కాలువలోకి దిగబోయి ముక్కు మూసుకుని "అబ్బా! పరమ కంపు!" అంటూ వెనక్కొచ్చేశాడు. గంగాబాయి కొడుకు నడుముమీద చేతులుంచుకొని బంతికేసి చూస్తూ నిలుచున్నాడు. సుభద్ర వాడి భంగిమ చూసి నవ్వుతూ "అదిగో! అక్కడ కనబడుతోంది. వెళ్ళి తీసుకోరా!..." అంది. గంగాబాయి కొడుకు ఆమెకేసి గంభీరంగా చూసి. "మాకు తెలుసు. నువ్వేమీ నవ్వాల్సిన పనిలేదు. ఇంక నేను ఆబంతిని ముట్టుకుంటాననుకున్నావేం?... నే నా పాడు కాలువలో దిగను; ఆ పాడుబంతి నాకొద్దు..." అనేసి, "రారా జగ్గూ!...మనం వెళ్ళి జిల్లా, కోడీ ఆడుకుందాం!..." అంటూ నేస్తాన్ని వెంటబెట్టుకుని ఎటోదూరంగా వెళ్లిపోయాడు.

సుభద్ర ఆలోచనలు పలువిధాల పోయాయి... "గంగాబాయి కొడుకు బంతిని పారవేసి పోయాడు. ఇక దానిని ముట్టుకోడు. అది అలా ఆ కాలువలో పడివుండవలసిందే! నేను దానిని తీసుకుంటే...అందులో తప్పేముంది?... ఆ బంతిని జాగ్రత్తగా దాచిపెట్టి, బాబు పెద్దవాడయ్యాక

ఆడుకోమని వాడికివ్వచ్చు. "ఇదెక్కడిది ఈ బంతి! మాది లాగుందే!" అని అప్పుడు గంగాబాయి అంటుందేమో... ఆఁ...అంతవరకు యిక్కడ కాపురంవుంటేగా?...ఈ సంవత్సరంలోపునే ఆయనకు ప్రమోషన్ రాకపోతుందా! అప్పుడు చక్కా గాంధీనగర్‌కి వెళ్లిపోవచ్చు. అప్పుడు ఈ గంగాబాయి గాంధీనగర్ కెందుకొస్తుంది? ఈ బంతినెందుకు చూస్తుంది?...నా వెర్రిగాని!..." అనుకుంది.

ప్రొద్దు మరొక బార పైకెక్కింది. సుభద్ర చుట్టూ జాగ్రత్తగా పరకాయించి చూసింది. ఆమెకు నరవాసన సోకలేదు. మెల్లగా కాలువలోనికి దిగింది. గాజు పెంకులు, కుండ పెంకుల నడుమ బురదలో మునిగివున్న బంతిని ఎడమ చేతితో అందుకున్నది. గబగబ కాలువలోంచి ఇవతలికొచ్చి గబుక్కున యింట్లోకి వెళ్లిపోయింది.

...ఆమెకు చాలా ఆశ్చర్యం వేసింది. దుర్గంధాన్ని భరించలేని తాను కాలువలోకి ఎలా దిగగలిగింది?...బంతిని ఎలా తీయగలిగింది? ఆ చెడువాసన తనకు తగలకపోవడానికి కారణమేమి?...దొంగతనం చేస్తున్నామన్న భయం! ఔను! తాను దొంగతనమే చేసింది!...బాబుకోసం బంతిని దొంగిలించింది...ఆమెలో ఏదో భయం ఆవహించింది.

...సుభద్ర బంతిని కడిగింది. దాన్ని పిడకలగోతంలో దాచిపెట్టింది.

మధ్యాహ్నం కావస్తోంది. సుభద్ర అన్నం తిందామని కంచం కడుక్కుంటూవుండగా — బయటినుంచి ఏదో

ఖాంగామూ వినిపించింది. గంగాబాయి గొంతు గింగురుమంటూ మారుమ్రోగి పోతోంది. సుభద్ర బయటికి రావడానికి భయపడింది. కిటికీలోంచి బయటికి చూసింది.

గంగాబాయి—కొడుకు రెక్క పట్టుకొని, "ఏదీ, ఎక్కడ పారేశావ్ ? చెప్పు భడవా !" అంటోంది. వాడు సన్నగా గునుస్తూ—"ఇక్కడే!" అంటున్నాడు కాలువలోకి చూపించి.

"ఏదీ? మరి—కనిపించదే!" అంటూ గంగాబాయి చూపులతో కాలువనంతా వెతికేసింది. బంతి కనిపించక పోగా-ఆమె రెచ్చిపోయిన కోపంతో అగ్గిలా మండిపడుతూ- "వెధవా! దేన్నయినా చూస్తే కావాలి మొర్రో అంటావే-వాటిని వుంచుకోడానికి తెలీదూ?" అడ్డమైన వాళ్ళతో అంతా కలియడం; వస్తువులు పోగొట్టుకోవడం! దొంగలతో సావాసంవద్దూ అంటే వింటావూ?...అఘోరించు!" అంటూ కొడుకును చెడామడా నాలుగు బాదింది. "ఒక్కరూపాయ పెట్టికొన్న బంతమ్మా! కొనేంతవరకు బతకనిచ్చాడుగాడు. ఏ అల్పాయుష్కుడి వాతబడిందో; వాడి చేతులు పడిపోనూ!" అంది మళ్ళీ, కసిగా.

సుభద్ర మనస్సు చివుక్కుమంది. గంగాబాయి ముఖంచూచే ధైర్యంలేక లోపలే వుండిపోయింది. ఇంతలో ప్రక్కింట్లోనుండి జానకమ్మ కొడుకు బావురుమంటూ ఏడ్చాడు. "దరిద్రపు వెధవా! వున్న శని చాలకుండా నువ్వెక్కడ దాపురించావురా నాకు!—ఏలినాటి శని. దోవన

బోయే తద్దినాన్నంతా యింట్లోకి తీసుకురావడమేనా నీ పని? చెడుసావాసాలు చేయకురా వెధవా అంటే వింటావా? ...బంతిపోతే నువ్వేనా దొరకాలి వాళ్ళకు? దాని నోరు పడిపోనూ. అది చూడు ఎంతెంత మాటలంటూవుందో! అనుభవించు!'' అంటూ తన కొడుకును కొడుతోంది జానకమ్మ.

సుభద్ర గుండె కదిలిపోయింది. తన వీపుమీద తాట లేచిపోతున్నంత బాధ పడింది.

గంగాబాయి—కొడుకును అడుగుతోంది. ''బంతి కాలవలో పడ్డప్పుడు ఎవరెవరు చూశారు?''

''జగ్గూ...''

''ఇంకెవరూ చూళ్ళేదా?''

''ఊహూ! సుభద్రక్క చూచింది. మరెవరూ చూళ్ళేదు.''

గంగాబాయి కేకపెట్టింది: ''ఏమమ్మో సుభద్రా! నువ్వేమైనా చూశావా మావాడి బంతి!'' సుభద్ర సమాధానమివ్వలేక తటపటాయించింది. ''అదేమోనమ్మా—నాకేం తెలుసు? బంతి ఆడుకునే పిల్లలు నాకెవరున్నారు?'' అంది తలుపు చాటున నిలబడి.

''ఎవరుజూసి ఏంలాభంలే! పోయిన బంతి వస్తుందా? శాపనార్థాలకు జడిసే రకాలై తేకదూ! వాళ్ళ చేతులు విరిగి

పోనూ! వాళ్ళకొంపలు కొల్లబోనూ! వాళ్ళ కొడుకులు వాళ్ళకు దక్కవద్దూ? మాబంతి పోతే పోయింది. నాలుగో నాటికంతా వాళ్ళ పిల్లలు ఎగిరిపడి చావకపోతే నేను గంగాబాయినేకాను.... వాళ్ళ వంశం నామరూపాలు లేకుండా పోదూ!...'' అంటూ తిట్ల దండకం ఏకరువు పెడుతూ వెళ్ళిపోయింది గంగాబాయి.

సుభద్ర చేతిలోని కంచం జారిపడింది. ఆమె హృదయం ముక్కచెక్కలైపోయింది. నిలువెల్లా వణకిపోయింది. ఆమె ఇంతటి పసివయసులోనే ఎన్నో కష్టాలూ, బాధలూ అనుభవించింది. ఏనాడుకూడా సుభద్ర ఇంత బాధపడలేదు. ఉయ్యాలదగ్గరికి పరుగుతీసింది ఆమె. బాబు ఉయ్యాలకు కట్టిన చిలుకలతో ఆడుకుంటూ నవ్వుకుంటున్నాడు. వాణ్ణి పైకెత్తుకుని, తన గుండెలకు హత్తుకుని, నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది. ఆ అంతరాగ్ని చల్లారి, గుండె బరువు తగ్గేసరికి-బాబు ఆమె కౌగిట్లో ఒళ్ళు మరచి నిద్రపోతున్నాడు. ఆమె వాణ్ణి ముద్దుపెట్టుకుని ఉయ్యాలలో పడుకోబెట్టింది. అన్నం మాట కూడా మరచిపోయిందామె. ఆకలి ఆమె దరిదాపులకైనా రాలేకపోయింది. తన్నుతాను తిట్టిపోసుకుంది. "నన్ను కోసినా పాపంలేదు. నేను చేసిన పాడుపనికి నా బాబుకు శిక్షా?'' అనుకుని మళ్ళీ కంటతడి పెట్టుకుంది. "ఈ రోజంత చెడురోజు లేదు. దానినోరు పడిపోనూ! నా బాబును ఎన్నెన్ని మాటలంది! అన్నీ విని ఘూకున్నాడు నా చిట్టి తండ్రి.''

"...ఇంతకూ తప్పంతా నాదే. ఆగంప గయ్యాళి స్వభావం తెలిసివుండీ, ఆ ముష్టి బంతిని ఎందుకు ముట్టుకోవాలి?...సాయంత్రం కాగానే దిష్టి తీసెయ్యాలి నా చిన్ని తండ్రికి" అనుకుంటూ ఓదార్చుకుంది తనను తాను.

...సుభద్ర లేచి పిడకల గోతంలోవున్న బంతిని బయటికి దీసి—దాన్ని ఎవరూ చూడకుండా—కాలువలోకి విసిరేసింది.

అరగంట తరువాత—గంగాబాయిగారి పిండి జల్లెడ చేత బట్టుకుని, ఆమె ఇంటికి వెళ్ళింది సుభద్ర. జల్లెడ గంగాబాయి చేతికందించి-"ఏమిటి పిన్నీ! ఇందాకా ఏదో బంతి పోయిందని అనవసరంగా హడావిడి చేస్తూవున్నారే; బంతిలాంటిదేదో కాలువలో వుందేమరి?..." అంది మన స్సాక్షికి ముసుగు దొడుగుతూ.

"ఏదీ, చూపించూ..."అంటూ బయటికి దారితీసింది గంగాబాయి.

"అదిగో! ఆ రాళ్ళప్రక్కన బంతేగదూ అది!" అంటూ వేలెట్టి చూపింది సుభద్ర.

"ఔనౌను. బంతే! నే నిందాకా వెతికాను. కనుక్కోలేకనే పోయానుసుమా! అయితే—చత్వారం వచ్చేస్తోందన్నమాట! త్వరగా కళ్ళద్దాలు వేయించుకోవాలి! ఇదిగో అమ్మాయి!...నీ కడుపున నావంటి ఆడకూతురు పుడుతుందిలే...దాన్ని యిలా అందుకో తల్లీ."

"ఎబ్బే! ఆ కంపు నేను భరించలేను తల్లీ!" అంటూ గబుక్కున ముక్కు పట్టుకుంది సుభద్ర.

గంగాబాయి బురదలోనుండి బంతిని బయటికి లాగి, "నా నాలుక తెగిపోనూ! తొందరపడి యిరుగుపొరుగువాళ్ళ నందర్నీ అనరాని మాట లన్నానే! అయ్యయ్యో! ఎంత పని జరిగిపోయింది!..." అంటూ తన పశ్చాత్తాపాన్ని వెలిబుచ్చింది.

ఇది విని, సుభద్ర మనస్సు తేలిక పడింది. ఆమె సంతోషంగా ఉచ్ఛ్వసించి, యింటిలోపలికి వెళ్ళింది. ఉయ్యాలలో కొడుకు నిద్రపోతున్నాడు. సుభద్ర వాడి ముఖాన్ని వాత్సల్యంతో చూసింది. "దొంగ! అంతా వీడి మూలంగానే. పైగా—ఏమీ తెలీనట్లు యీ దొంగనిద్ర ఒకటి!.." అంటూ ముందుకు వంగి, వాడి లేత చెంపను ముద్దెట్టుకున్నది.

★★